# ఆయుధం పట్టని యోధుడు

## మార్టిన్ లూథర్ కింగ్



ఎం.వి.రమణారెడ్డి

# ఆయుధం పట్టని యోధుడు

అమెరికన్ నల్లజాతి పోరాటంలో

అహింసా విధానానికి ఊపిరి పోసి,

‘నోబెల్ శాంతి పురస్కారం’తో సత్కరించబడిన

డా. మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్ర


రచన:

**డా. ఎం.వి.రమణారెడ్డి**



ప్రచురణ:

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

**హైదరాబాద్.**

**ఆయుధం పట్టని యోధుడు**
తొలి ప్రచురణ: మార్చి 2008

హక్కులు: రచయితవి

ముఖచిత్రం:

వెల:

ముద్రణ:

ప్రతులకు:
హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ 85 బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్-500 067.

Published by:
Hyderabad Book Trust, Plot no. 85, Balaji Nagar,
Gudi Malkapur, HYDERABAD-500 067.

Ph. no. 23521849, 23517401.

## అంకితం:

కులాలకూ మతాలకూ అతీతంగా

మనిషిలోని విలువలను ఆదరించే సహృదయులకు

# - ఒక పాఠకుడిగా . . .

చాలా ఏళ్ళక్రితం నేను చదివిన హారియట్ బీషర్‌స్టోవే రాసిన 'అంకుల్ టామ్స్ కేబిన్' నవలా, హోవర్డ్ ఫాస్ట్ రాసిన 'ఫ్రీడం రోడ్' నవలా, ఎలెగ్జ్ హేలీ 'రూట్స్' నవలా, ఇలాంటివి మరికొన్ని, నా స్మృతి పథంలో మెదిలాయి డా.ఎం.వి. రమణారెడ్డిగారు 'ఆయుధం పట్టని యోధుడు' పేరుతో రాసిన మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్రను చదువుతున్నంతసేపూ!

ఆ నవలలు చదివినప్పుడు మనస్ఫూర్తిగా అమెరికాను అసహ్యించు కున్నాను! ప్రపంచంలో అగ్రరాజ్యంగా, నాగరిక దేశంగా 'కీర్తించబడుతున్న' అమె రికాలో శతాబ్దాల తరబడి నీగ్రోజాతిమీద జరిపిన దాడులూ, రంగు వివక్షా, అణచి వేతా, క్రూరమైన హింసాకాండా, ఇలాంటివి ఎన్నెన్నో అర్థమై, 'ఇంత అనాగరిక ఆటవిక రాజ్యమా అమెరికా?' అని కంపరం కలిగింది. ఈ నవలల్లోని కథాకాలం ఒక శతాబ్దం కిందటిదన్న మాట నిజమే అయినప్పటికీ, మీ చేతిలోవున్న ఈ పుస్తకంలోని చారిత్రికకాలం ఎప్పటిది? మొన్నటికి మొన్న, అమెరికాలో ఉంటున్న ఒక సాహితీమిత్రుడు ఇటీవల ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పిన మాటలేమిటి? ఇప్పటికీ నీగ్రోలపట్ల ఆ దేశంలో వివక్ష కొనసాగుతూనే వున్నదని ఆ మిత్రుడు పలు ఉదాహరణలతో నాకు తెలియజెప్పినాడు. విద్యాలయాల్లో మొక్కుబడిగా ఇప్పటికి గూడా కొద్ది శాతం మాత్రమే నల్లజాతివారిని అనుమతిస్తున్నారట! ఈ అమెరికాను స్వర్గధామంగా కలలుగంటూ, అక్కడికి వెళ్ళాలని ఉవ్విళ్ళూరే అసం ఖ్యాకుల పట్ల నిజంగానే నాకు జాలి కలిగింది!

అమెరికాతో మన దేశాన్ని పోల్చినప్పుడు, ఇక్కడ దళితుల పట్ల వివక్ష, అస్పృశ్యతా ఇంకా కొనసాగుతున్నప్పటికీ, అమెరికాలోలా క్రూరంగా, పాశవికంగా, నిర్లజ్జగా, నీగ్రోల పట్ల అనుసరించే జాతివివక్షతో పోల్చినప్పుడు, ఈ దేశం ఎంత నయమోగదా అనిపించింది. ఎం.వి.రమణారెడ్డిగారి ఈ పుస్తకం చదివిం తర్వాత, అమెరికా గురించి నా అభిప్రాయం మరింత బలపడటమే గాకుండా, ప్రపంచంలో అస్పృశ్యదేశం ఏదైనా ఉన్నదీ అంటే అది అమెరికానే అని గట్టిగా తీర్మానించుకున్నాను. ప్రపంచీకరణ పేరుతో ఆ దేశం కొనసాగిస్తున్న ఆర్థిక,

సాంస్కృతిక దోపిడీల వర్తమాన నేపథ్యంలో, ఈ పుస్తకం అవసరం ఎంతో ఉన్న దనీ, మరీ ముఖ్యంగా ఆ దేశంపట్ల భ్రమలుగలవారికి మరింత ఆవశ్యకత ఉందనీ నేను స్పష్టం చేస్తున్నాను.

మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్ర మాత్రమే కాదు, ఇది అమెరికా సాంస్కృతిక చరిత్ర కూడా!!

ఒక సిటీ బస్సులో ప్రయాణం చేస్తున్న ఒక నల్లజాతి స్త్రీ, ఒక తెల్లజాతీయునికి సీటు ఖాళీచేసి ఇవ్వని కారణంగా అరెస్టుకు గురిఅయింది - ఆ సంఘటనతో ప్రారంభమైన జాతివివక్ష వ్యతిరేక ఉద్యమం, మార్టిన్ లూథర్ కింగ్ నాయకత్వంలో ఎలాంటి ప్రకంపనలు కలిగించింది, ఎలాంటి అవరోధాలు ఎదుర్కొన్నది, ఎలాంటి అణిచివేతకు గురిఅయినది, ఎలాంటి దశలను అధిగమించినది, క్రమక్రమంగా విస్తరిస్తూ ఎలాంటి ఫలితాలను సాధించినది, ఈ పుస్తకంద్వారా పాఠకుడు గ్రహించడమే గాకుండా, తానుగూడా ఆ ఉద్యమంలో మానసికంగా ఉన్ముఖీకరణ చెందే విధంగా సాగిన రచనానిర్మాణం ఈ పుస్తకంయొక్క విశిష్టత!

మార్టిన్ లూథర్ కింగ్ ఉద్యమం అహింసాయుత ఉద్యమం - ఆయుధం పట్టని ఉద్యమం, బూటకపు ప్రజాస్వామ్యాన్ని బట్టబయలు చేసిన ఉద్యమం, కనీసపు ఓటుహక్కు కూడా లేని నీగ్రోలు పిడికిలి బిగించిన ఉద్యమం, అనేకానేక సంక్షోభాలనూ ఒత్తిళ్ళనూ అణచివేతలనూ ఎదుర్కొన్న ఉద్యమం, మనదేశపు మహాత్మాగాంధీని ఆదర్శంగా స్వీకరించిన ఉద్యమం, అసంఖ్యాక ప్రజాబలంతో విస్తరించిన ఉద్యమం, ఆశయంకోసం తన ప్రాణాలనే మార్టిన్ లూథర్ కింగ్ ఫణంగా పెట్టిన ఉద్యమం!!

ఈ పుస్తకంలో ఒకచోట అన్నట్టు, తాటాకు చప్పుళ్ళకు బెదిరే రకంగాదు అమెరికా! మార్టిన్ ఉద్యమాన్ని అణచటానికీ, అభాసుపాలు చేయటానికీ, కుటిలమైన జిత్తులతో మోసపు ఎత్తుగడలతో తీవ్రమైన నిర్బంధంతో ఎన్నెన్నో కుట్రల్ని పన్నిన వైనం, మనకు అమెరికా అప్రజాస్వామికత పట్ల ఏవగింపు కలిగేలా చేస్తుంది. పాఠకుడు ఈ పుస్తకం చదవటం ప్రారంభించినప్పటినుండి ఒక క్రమోన్మీలనంతో తాదాత్మ్యం చెందుతాడు, ఉద్విగ్నుడౌతాడు, ఉద్రిక్తుడౌతాడు, ఉత్తేజితుడౌతాడు!

ఎం.వి.రమణారెడ్డిగారు ఇప్పటికే కథకుడుగా (పరిష్కారం కథల సంపుటి), అనువాదకుడుగా (పాపియాన్, అవే విత్ ఆల్ ద పెస్ట్స్ అన్న గ్రంథాలకు),

పత్రికా సంపాదకుడుగా (ప్రభంజనం పత్రిక), రాయలసీమ ఉద్యమకారుడిగా (రాయలసీమ కన్నీటి గాథ), చాలామంది మాబోటివారికి చిరపరిచితులు. వారు మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్రను ఒక ఫిక్షన్‌లా నవలానిర్మాణంలో ఒదిగించి రాసిన తీరు పాఠకుడిని ముగ్ధుణ్ణి చేస్తుంది. వారి వాక్యనిర్మాణం, పదాల కూర్పు, శైలి పఠితను ముందుకు వెంటవెంటనే నడిపిస్తుంది. ప్రాంతీయమైన పలుకుబళ్ళు ఒక వింత సొబగుతో అక్కడక్కడా మెరుస్తాయి -

రెండువందల పుటల ఈ పుస్తకం రాయటానికి వారు పడిన శ్రమ నాకు తెలుసు. ఒక సంవత్సరమైనా వారు ఇందుకోసం వెచ్చించి వుంటారు. కనీసం నాలుగువేల పుటలకు పైగా ఇందుకు సంబంధించిన పుస్తకాలనూ, పత్రాలనూ అధ్యయనం చేసివుంటారు. పాఠకుడిని సునాయాసంగా చదివించే ఈ పుస్తకం వెనుక, వారి సుదీర్ఘ పరిశ్రమా, నిరంతర కృషీ దాగున్నాయని పాఠకుడు గుర్తిస్తే వారి రచనా లక్ష్యం నెరవేరినట్టే!

అనంతపురం, - సింగమనేని నారాయణ

14.02.2008.

# సందర్భం

మొదట మార్టిన్ లూథర్ కింగ్ ప్రసంగాలను తెలుగులోకి అనువదించమని శ్రీమతి గీతా రామస్వామిగారు నాకు అప్పగించారు. అవి అద్భుతమైన ప్రసంగాలు. మాటలను పదునైన ఆయుధంగా మలచిన అరుదైన వక్త డా. మార్టిన్ లూథర్ కింగ్. ఆయన ప్రసంగాలూ వ్యాసాలూ కలిసిన పుస్తకం దాదాపు 700 పేజీలుంది. అన్నిటినీ అనువదిస్తే తెలుగులో పుస్తకం రాశి మరింత పెరుగుతుంది. పుస్తకం పెద్దది కాకుండా చూడటానికి కొన్ని ప్రసంగాలనే ఏరుకున్నాం. దాదాపు పది ప్రసంగాల అనువాదం ముగిసిన తరువాత నాకొక అనుమానం తగిలింది. లూథర్ కింగ్‌ను ఎరిగినవాళ్ళు తెలుగు పాఠకుల్లో ఎక్కువమంది ఉండరు. ఆయనెవరో తెలీకుండా ఆ వ్యాసాలమీద ఆసక్తి కనబరిచే అవసరం ఎవరికుంటుంది? అందువల్ల, ఆయన జీవిత చరిత్రను తెలుగులో తీసుకురావడం అవసర మనిపించింది. గీతాగారిని సంప్రదిస్తే సరే నన్నారు.

లూథర్ కింగ్ జీవితాన్నీ, సిద్ధాంతాన్నీ ప్రశంసించే రచనలూ, విమర్శించే రచనలూ ఇంగ్లీషులో కొల్లలు. ఆయన స్నేహితులు వ్రాసినవీ, ఆయన భార్య కొరెట్టా పర్యవేక్షణలో వెలువడినవి గూడా చాలా ఉన్నాయి. వాటిల్లో చాలా పుస్తకాలు గీతాగారు నాకు అందజేశారు. ఏవొక్కటి తెలుగు పాఠకులను మెప్పించేలా నాకు కనిపించలేదు. అనువాదం కంటే, ఆ సమాచారాన్ని ఆధారం చేసుకుని కొత్త పుస్తకం తయారుజెయ్యడం మంచిదని నాకు తోచింది. ఆ ప్రయత్నం ఏడాది క్రిందట మొదలెట్టాను. చాలా ఇబ్బంది పడ్డాను. ప్రతి పది పేజీల తయారీకి కనీసం నాలుగువందల పేజీలను అధ్యయనం చేసి, దాన్నుండి కావలసిన సమాచారం ఏరుకోవాలి. ఇంటర్నెట్ సౌకర్యంతో దొరికిన సమాచారం ఈ పరిశ్రమలో నాకు చాలా ఉపకరించింది. ప్రశంసల్లో విమర్శల్లో దేన్నీ నిర్లక్ష్యం చెయ్యకుండా, కథానాయకుని వ్యక్తిత్వం చిన్నబోకుండా కలబోయడం పెద్ద కసరతుగా, చివరకు ఈ రచన ముగించగలిగాను. దీనికి వెల కట్టే బాధ్యత ఇక మీదే. నమస్తే.

**-రచయిత**

## గనుపులు:


| | |
|---|---|
| 1. బాల్యం | 3 |
| 2. కౌమారం | 11 |
| 3. యవ్వనం | 17 |
| 4. ఉద్యోగం | 23 |
| 5. ఉద్యమం | 27 |
| 6. సన్నాహం | 33 |
| 7. ప్రతీకారం | 40 |
| 8. ఉపశమనం | 47 |
| 9. బీభత్సం | 57 |
| 10. ఉత్సాహం | 63 |
| 11. గతుకుల ప్రయాణం | 70 |
| 12. అపాయం | 75 |
| 13. తీర్థయాత్ర | 79 |
| 14. ఇంటిపోరు | 86 |
| 15. సుడిగుండం | 90 |
| 16. ఎన్నికలు | 96 |
| 17. స్వేచ్ఛాప్రయాణం | 102 |
| 18. ఎదురుదెబ్బ | 111 |
| 19. బర్మింగ్‌హాం | 124 |
| 20. వాషింగ్టన్ డి.సి.లో కవాతు | 141 |
| 21. పంజా విసిరిన పెద్దపులి | 150 |
| 22. ఫలించిన కల | 153 |
| 23. ఓటుహక్కు | 162 |
| 24. కొత్తకోణం | 177 |
| 25. ఉత్తరాదిపై దండయాత్ర | 185 |
| 26. మొండిపట్టు | 199 |
| 27. చెదరిపోయిన కల | 205 |

# బాల్యం

అనగా అనగా ఒకప్పుడు, ఈజిప్టు అంతరిక్షంలో ఒక నక్షత్రం పొడిచింది. ఫ్యారో చక్రవర్తుల ఉక్కుపాదంక్రింద నలిగిపోతున్న ఇజ్రేలీ బానిసలకది విజయకేతన మైంది. బానిసలు నివసించే మురికివాడలో ఒక పసికందు రూపంలో తిరుగుబాటు జన్మించింది. ఆ నక్షత్రాన్ని చూడగానే మతగురువులు కంగారుపడ్డారు. రాజ ప్రాసాదానికి పరుగులు తీశారు. బానిసవాడలో శత్రువు ఆవిర్భవించిన సంకేతం పొడచూపిందని చక్రవర్తికి నివేదించారు. బానిసకుటుంబాల్లో పుట్టిన పసిపిల్లలందరిని నరికేయమని చక్రవర్తి ఆజ్ఞాపించాడు. బొడ్డూడని పిల్లలంతా పురిట్లోనే ప్రాణాలు కోల్పోయారు. కానీ, అసలు బిడ్డ తప్పించుకుని చక్రవర్తి అంతఃపురం చేరిపోయింది. మోసెస్ పేరుతో అక్కడే పెరిగి, ఫ్యారోల పెత్తనాన్ని తుదముట్టించింది. బానిస లందరిని విముక్తిచేసి, ఎర్రసముద్రం దాటించి, ఇజ్రేల్లో 'దేవుని సామ్రాజ్యం' స్థాపించింది. ఇదొక మతగ్రంథం చెప్పిన ఇతిహాసం.

చాలారోజుల తరువాత అలాటి మరో నక్షత్రం అరబ్బీ గగనతలంమీద మిరుమిట్లు గొలిపింది. ఈ నక్షత్రంగూడా ఎంతోమంది పసికందులను రోమన్ చక్రవర్తి నిరంకుశత్వానికి బలిచేసింది. అసలు శిశువు ఈసారిగూడా తప్పించుకుంది. గొర్రెలకొట్టంలో పుట్టి జీసెస్‌గా చరిత్రలో నిలిచింది.

"దుర్మార్గం ప్రబలినప్పుడు చోటుచేసుకునే సంఘటనల్లో, సీజర్ అంతః పురాన్ని ఆక్రమించనూవచ్చు, క్రీస్తు శిలువమీదికు చేరనూవచ్చు. కానీ, క్రీస్తుపూర్వం క్రీస్తుశకంగా చరిత్రను విభజిస్తూ, సీజర్ జీవితకాలాన్ని సైతం తన పేరుమీదుగా లెక్కగట్టే చరిత్రగా అదే క్రీస్తు వొకానొకరోజు సజీవుడై లేచి నిలుచుంటాడు." అనేది డా. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ విశ్వాసం.

అమెరికా సంయుక్తరాష్ట్రాల అంతరిక్షంలో 1929 జనవరి 15న ప్రత్యేక నక్షత్రమేదైనా అవతరించిందో లేదో తెలీదుగానీ, ఆ రోజు, అట్లాంటా నగరంలోని ఆబర్న్-అవెన్యూలోని ఒక సాధారణ నీగ్రో కుటుంబంలో డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ జన్మించాడు. అది ఆయన తాతగారి ఇల్లు. తండ్రి మైకేల్ (తరువాత మార్టిన్‌గా ఆయన పేరు మారింది) లూథర్ కింగ్ సీనియర్. తల్లి ఆల్బర్టా. ఎబనేజర్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్‌గా పనిజేసే ఏ.డి.విలియమ్స్‌కు ఆమె ఏకైక కుమార్తె. అందువల్ల, అల్లుడూ కూతుర్లను విలియమ్స్ తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. 1931లో

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=819](http://kinige.com/kbook.php?id=819)**

* * *

**Read other books of Dr.M.V. Ramana Reddy @**

**[http://kinige.com/kbrowse.php?via=author&id=261](http://kinige.com/kbrowse.php?via=author&id=261)**